ప్రజాశక్తి
సోమవారం 10 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కవిటి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నివాసంలో పలువురు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు ఆదివారం కలిసి ఆయన్ను అభినందించారు. దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఎమ్మెల్సీ పదవికి పూర్తి న్యాయం చేస్తానన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు బి.మోహనరావు, ఆర్.గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఎన్.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుపై మీ వైఖరేంటి?

- రాజకీయ పార్టీలు తమ నిర్ణయాన్ని వెల్లడించాలి
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటాలపై, సిపిఎస్ రద్దు అంశంపై రాజకీయ పార్టీలు తమ నిర్ణయాన్ని ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు పి.అప్పారావు అధ్యక్షతన నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో సిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చినప్పుడు వామపక్షాలు తప్ప మిగిలిన పార్టీలన్నీ అనుకూలంగా ఓటు వేశాయని గుర్తు చేశారు. 2004 నుంచి సిపిఎస్‌కు వ్యతిరేకంగా పాత పెన్షన్ విధానం కావాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తూనే ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీనిచ్చి, అధికారంలోకి వచ్చాక దాని ఊసెత్తకపోవడం సరికాదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా కాకుండా నిర్దిష్టంగా సిపిఎస్ రద్దుపై రాజకీయ పార్టీలు అభిప్రాయాలు చెప్పాలని కోరారు. దేశవ్యాప్తంగా సిపిఎస్ రద్దు పోరాటాలు ఉధృతమైన నేపథ్యంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తున్నట్లు కొన్ని రాష్ట్రాలు ప్రకటించి, జిఒలు విడుదల చేశాయని చెప్పారు. పాత పెన్షన్ విధానంలోకి వెళ్తే ఎన్ఎస్‌డిఎల్ లోని సొమ్ము తిరిగి రాదని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. 2013లో చట్టమైన పిఎఫ్ఆర్‌డిఎను రద్దు చేయడం ద్వారా మాత్రమే సిపిఎస్ రద్దు సాధ్యమని స్పష్టం చేశారు. పెన్షన్ ఇవ్వడం వల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలం అవుతుందని చెప్పడం పైనా విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. 30 ఏళ్ల పని చేయించుకున్నాక పెన్షన్‌ని కొనుక్కోవాలని చెప్పడం ప్రజాస్వామ్యంలో ఎలాంటి సంకేతం ఇస్తుందో పెన్షన్ ప్రభుత్వ బాధ్యత కాదని చెప్పే వారు సమాధానం చెప్పాలన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఇబ్బంది పడితే కార్పొరేట్లకు లాభాల మీద లాభాలు ఎలా వచ్చాయో కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి నష్టమని... కార్పొరేట్లకు మాత్రమే లాభమని గణాంకాలు చెప్తున్నా సిపిఎస్‌ను ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యోగుల రిటైర్మెంట్ తదుపరి సదుపాయాలు షేర్ మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని నిర్వహించే సభలు, సమావేశాలకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడం సరికాదన్నారు. సిపిఎస్ రద్దు పోరాటాల సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్స్ కె.వైకుంఠరావు, ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, కె.దాలయ్య, పి.సూర్యప్రకాశరావు, జి.మాధవరావు, జి.సురేష్, హెచ్.అన్నాజీరావు, జి.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విధులు నిర్వహిస్తున్న విఆర్‌ఒలు (ఫైల్)

పని బారెడు... జీతం మూరెడు

- చాలీచాలని జీతాలు
- ఆర్థిక సమస్యల్లో కుటుంబాలు
- ప్రొబేషన్ కోసం విఆర్‌ఒ ఎదురుచూపులు

ప్రజాశక్తి - కవిటి

వారంతా విఆర్‌ఎల నుంచి విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతులు పొందిన వారు. రెగ్యులర్ విఆర్‌ఒలతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. అయినా ఇప్పటికీ వారికి ప్రొబేషన్ కేటాయించకపోవడంతో చాలీచాలని జీతాలతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోజురోజుకూ కుటుంబ ఖర్చులు పెరిగిపోతుండగా, నెలకు వీరికి వస్తున్న రూ.15 వేలు ఏ మూలకూ సరిపోవడం లేదు. దీంతో వీరి కుటుంబాలు ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా సుమారు 198 మంది విఆర్‌ఎలు విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతులు పొందారు. మూడేళ్లుగా వీరు తమ సేవలందిస్తూ తమ పరిధిలో పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రొబేషన్ పూర్తయి శాశ్వత ఉద్యోగులుగా మారాలంటే సర్వే పరీక్ష ఉత్తీర్ణులవ్వాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఆ పరీక్ష వీరికి ఏడాది లోగా నిర్వహించాలి. రెండేళ్ల తర్వాత ప్రభుత్వం ఆ పరీక్ష నిర్వహించింది. సగానికి పైగా అందులో ఉత్తీర్ణులైనా, నేటికీ ప్రొబేషన్ డిక్లేర్ చేయకపోవడంతో అదే జీతంతో కొనసాగుతున్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు తమ సమస్యలను మొర పెట్టుకున్నారు. ఇప్పటికైనా ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరుతున్నారు.

కుటుంబం గడవడం కష్టంగా ఉంది



ప్రస్తుతం అందుతున్న జీతంతో కుటుంబాన్ని పోషించడం కష్టంగా ఉంది. పెరిగిన ఖర్చులకు వచ్చిన జీతం ఏ మూలకూ సరిపోవడం లేదు. మూడేళ్లుగా పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లోనూ సేవలందిస్తున్నాం. విధుల్లో చేరిన ఏడాదిలో సర్వే పరీక్ష నిర్వహించి, ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి. రెండేళ్ల తర్వాత నిర్వహించినా, ఇంతవరకు ప్రొబేషన్ కేటాయించలేదు. ఇప్పటికైనా మా సేవలు గుర్తించి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి.

- బి.ఈశ్వరరావు,
విఆర్‌ఒ, సుంకిడి, సోంపేట మండలం

సామాన్యులకు అందుబాటులో వైద్యం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజానీకానికి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పురుషోత్తపురంలో రూ.17.5 లక్షల నిధులతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. సుమారు రూ.2.30 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ ఆస్పత్రి భవనానికి ఎకరా స్థలాన్ని ఎంపిపి కె.వి.జి సత్యనారాయణ వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు వంటివని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా వైద్య సిబ్బంది ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ వైపు అడుగులు వేయాల్సిందేనన్నారు.



మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే తన సంకల్పమని తెలిపారు. ఇప్పటికే దాదాపుగా ప్రతి గ్రామంలోనూ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు వీలుగా భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీన్ని తాత్కాలికంగా గ్రామంలోని వైఎస్ఆర్ ఆరోగ్య క్లినిక్ భవనంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆరోగ్య ఆమదాలవలస నిర్మాణమే తన అభిమతమన్నారు. విద్యపరంగా పలు విద్యాసంస్థలను ఇప్పటికే ఆమదాలవలసలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్య రంగం ఆమదాలవలస నియోజకవర్గంలో విస్తృతమైన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి, ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి కె.వి.జి సత్యనారాయణ, జెడ్‌పిటిసిలు ఎస్.నాగేశ్వరరావు, ఎల్.కాంతారావు, బి.రామారావు, నాయకులు కర్నేన నాగేశ్వరరావు, కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

పోర్టు శంకుస్థాపనకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - నౌపడ

భావనపాడు గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో శంకుస్థాపనకు అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు జాయింట్ కలెక్టర్ నవీన్ ఆదివారం పర్యటించారు. బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలంపై ఆరా తీశారు. పోర్టు నిర్మాణ ప్రాంతం, శంకుస్థాపన స్థలాన్ని మ్యాపు ద్వారా పరిశీలించారు. పాలనాయుడుపేట నుంచి మూలపేట వరకు ఇరుకు రోడ్లలో ప్రయాణం చేయాల్సి రావడం, రెండు ఇరుకైన ఉప్పునీటి వంతెనలు దాటాల్సి ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉందని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే మరోచోట అనువైన స్థలం పరిశీలించాలని ఆదేశించారు. కాకరపల్లి పవర్‌ప్లాంట్, నౌపడ పరిసర ప్రాంతాల్లో సభ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం పరిశీలించామని అధికారులు జెసి దష్టికి తీసుకొచ్చారు. త్వరితగతిన శంకుస్థాపనకు అనుకూల ప్రదేశం, సభా ప్రాంగణాన్ని గుర్తించాలని జెసి అన్నారు. శంకుస్థాపనకు వచ్చే అతిథులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ చలమయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో టెక్కలి సిఐ చంద్రమౌళి, మూలపేట సర్పంచ్ బాబూరావు, ఆర్ఐ చంద్రమౌళి,సర్వేయర్ బాలరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్, విఆర్‌ఒ ప్రసాద్ తదితరులున్నారు.



శంకుస్థాపనకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి నవీన్

నేడు మంత్రుల పర్యటన!

పోర్టుకు సిఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సోమవారం మూలపేటలో పర్యటించే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ పరిశీలనకు రానున్నారని సమాచారం. దీంతో మూలపేట, విష్ణుచక్రం, నౌపడ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు చక్కర్లు కొడుతున్నారు.

ఆడిటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆడిటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని చింతాడ సమీపాన ఒక కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన పరోక్ష పన్నుపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పన్నులను జిఎస్‌టి రూపంలోకి మార్చిన తర్వాత ఆడిటర్లకు అనేక కొత్త సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. ఆడిటర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ప్రతినిధులు ఎంతో పట్టుదలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పరిష్కరించుకోగలిగారని ప్రశంసించారు. జిఎస్‌టి ఛైర్మన్‌ను కలిసి సమస్యలు విన్నవించినప్పుడు తొలుత ఐదు నిమిషాల వ్యవధిని ఇచ్చినా, 45 నిమిషాల పాటు సుదీర్ఘంగా ఆడిటర్ల సమస్యలు విని పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రజలు పన్నులు చెల్లించడం బాధగా కాకుండా బాధ్యతగా భావించాలన్నారు. ఆ దిశగా ఆడిటర్స్ టాక్స్ పేయర్స్‌కు అవగాహన కల్పించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

జిఎస్‌టి ప్రిన్సిపాల్ కమిషనర్ ఎం.రఘురామ రెడ్డి మాట్లాడుతూ ఆడిటర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిందన్నారు. మార్చిలో రూ.1.60 లక్షల పన్నులు వసూలు చేయడం వెనుక అందరి కృషి ఉందన్నారు.

అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యాన ఎంపీని సత్కరించారు. తొలుత నృత్య ప్రదర్శన చేసిన నృత్య కళాకారిణి శ్రీలతకు ఎంపీ చేతుల మీదుగా మెమోంటో అందజేశారు. సెమినార్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షరీఫ్‌ఖాన్, సహాయ కమిషనర్ శ్వేతా సురేష్, రాష్ట్ర కార్యదర్శి బుడుమూరు శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షుడు ఎం.వి.కె మూర్తి, జిల్లా అధ్యక్షులు తెలుగు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి రమణ పట్నాయక్, నగర అధ్యక్షుడు జె.ఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం

పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా వైసిపి పాలనపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస- కాశీబుగ్గ మున్సిపాల్టీలో 18, 19, 20వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతిఒక్కరి భవిష్యత్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో 1.60 లక్షల కుటుంబాలతో నేరుగా ఎమ్మెల్యేలు మాట్లాడతారని తెలిపారు. ప్రజలను నేరుగా కలిసి వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం అడిగి తెలుసుకుంటామన్నారు. ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిగా తెలుసుకుని అక్కడిక్కడే సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

వైసిపి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. దీంతో జన్మభూమి కమిటీలు వంటి దళారీ వ్యవస్థను నిర్మూలించామన్నారు. ప్రజా మద్దతు పుస్తకంలో ఇచ్చిన ప్రశ్నలను ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డబ్బీర్ భవానీ శంకర్, పట్టణ అధ్యక్షుడు సనపల సింహాచలం, బడగల బాలచంద్రుడు, ఎస్.గోపి, అంబటి ఆనంద్, బమ్మిడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అప్పలరాజు

'ఉపాధి' కూలీలకు బీమా

- బకాయిల చెల్లింపులు వేగవంతం
- బిల్లులు సకాలంలో అప్‌లోడ్ చేస్తే వేతనాలు
- 'ఉపాధి' కూలీలకు గరిష్ట కూలికి చర్యలు
- డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు వెల్లడించారు. జిల్లాలో కూలీలకు సగటు కూలి ప్రస్తుతం రూ.159.18 చెల్లిస్తున్నామని, గరిష్ట కూలి రూ.272 వరకు పొందే అవకాశముందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2.94 కోట్ల పనిదినాలను పూర్తి చేసినట్లు తెలిపారు. సుమారు రూ.52 కోట్ల మేర వేతన బకాయిలు ఉన్నాయని, వాటిని ఎప్పటికప్పుడు ప్రభుత్వం విడుదల చేస్తోందని చెప్పారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.





జిల్లాలో ఉపాధి బకాయిల చెల్లింపుల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో సుమారు రెండు లక్షల మందికి పైగా కూలీలు జాబ్‌కార్డు కలిగి ఉన్నారు. ఈ ఏడాది చేపట్టిన పనులకు గానూ ఇప్పటివరకు సుమారు రూ.ఎనిమిది కోట్ల కూలి బకాయిలను చెల్లించాం. మిగిలిన రూ.52 కోట్లు సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశాం. పలు దశల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. బకాయిల విడుదలకు సకాలంలో చేపట్టిన పని బిల్లులను అప్‌లోడ్ చేయాలి. అప్పుడే చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయడానికి వీలుంది. ఇప్పటికే క్షేత్రస్థాయి అధికారులకు ఆ దిశగా ఆదేశాలు జారీ చేశాం.

సగటున ఎంత కూలి లభిస్తోంది? పెంచేందుకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

ఉపాధి కూలీలు కచ్చితంగా పని ప్రదేశాల్లో ఆరు గంటల పాటు పనిచేయాల్సి ఉంటుంది. అప్పుడే పూర్తిస్థాయి కూలి పొందడానికి వీలుంటుంది. క్షేత్రస్థాయి పర్యవేక్షణా లోపం వల్ల పని ప్రదేశాల్లో కూలీలు ఎక్కువ సమయం ఉండడం లేదు. దీనివల్ల అనుకున్న స్థాయిలో పనులు జరగక కూలి తగ్గుతోంది.

ప్రతి కూలీకి వంద రోజుల పనిదినాలతో పాటు రూ.272 గరిష్ట కూలిని పొందడానికి అవకాశం ఉంది. రోజూ ఆరు గంటల పాటు పనిచేస్తే గ్రామానికి మౌలిక వసతులు సమకూర్చుకుంటున్నామన్న భావనతో పనిచేస్తే పూర్తిస్థాయి కూలిని అందుకునేందుకు వీలవుతుంది.

వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల్లో ఎలాంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు?

ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు చేయాలని కూలీలకు తెలియజేశాం. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ఉపాధి పనుల్లో మెటీరియల్ కాంపొనెంట్ లక్ష్యం ఎంత?

గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన భవనాల నిర్మాణం చేపడుతున్నాం. గ్రామ సచివాయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, ఏరియా బల్క్ మిల్క్ యూనిట్లు నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. రైతుల అవసరాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలను మంజూరు చేశారు. మొదటి విడతలో జిల్లావ్యాప్తంగా 834 రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలను సమకూర్చడానికి రూ.183.25 కోట్లు ఖర్చు చేయడమైంది. రెండో విడత పనులు కొనసాగుతున్నాయి. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కొన్ని పనులు మంజూరు చేస్తున్నాం.

అమృత్ సరోవర్ పనులు ఎలా సాగుతున్నాయి?

అమృత్ సరోవర్ కింద 80 చెరువులను సుందరంగా తీర్చిదిద్దాలని సంకల్పించాం. ప్రతి నియోజకవర్గంలో ఉన్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ పనులు మంజూరు చేయడమైంది. వీటిలో 32 చెరువుల్లో పనులు పూర్తి చేశాం. 10 శాతం నిధులు మెటీరియల్ కాంపొనెంట్‌కు ఖర్చు చేసుకోవచ్చు. గట్టుపై అందమైన మొక్కలు పెంచడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఈ పథకం దోహదపడుతోంది. లావేరు మండలంలో మోడల్ చెరువును అభివృద్ధి చేశాం.

48 చెరువుల పనులు పలు దశల్లో కొనసాగుతున్నాయి. వాటిని త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ఎక్కడైనా అమృత్ సరోవర్ కింద పనులు మంజూరు కాకపోయినా అక్కడున్న ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు ఉపాధి పనులు మంజూరు చేసుకునేందుకు వీలుంది.

జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఎంతమేరకు పూర్తి చేశారు?

అన్ని మండలాల్లో జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ చేపట్టాలని ఆదేశించాం. కొన్ని మండలాల్లో ఇంతవరకు పూర్తి కాకపోవడం వల్ల శతశాతం అనుసంధాన ప్రక్రియ సాధించడం కొంత జాప్యమవుతోంది.

మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఎంపీ రామ్మోహన్ నాయుడు



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా శ్రీశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం మహిళా సాధికారిత సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన కరణం మల్లేశ్వరి, ఎంతో మంది ఐఎఎస్, ఐపిఎస్‌ల్లో చోటు దక్కించుకున్న జిల్లా మహిళలు, సాఫ్ట్‌వేర్ రంగంలోను, వైద్య రంగంలోను, నిష్ణాతులుగా దేశ విదేశాల్లో పనిచేస్తున్న జిల్లా మహిళలు యువతకు ఆదర్శం కావాలన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సదస్సులో కాకినాడ ఆదిత్య, సన్ డిగ్రీ, మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. శ్రీశ్రీ ఫౌండేషన్ ద్వారా ఇంటర్ పూర్వ విద్యార్థుల నుంచి పాత పుస్తకాలను సేకరించారు. ఈ పుస్తకాలను ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు, శ్రీశ్రీ ఫౌండేషన్ కార్యదర్శి, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డాక్టర్ టి.మణికంఠ, శ్రీశ్రీ ఫౌండేషన్ చైర్మన్ చింతు శ్రీకాంత్, వైస్ చైర్మన్ బంటుపల్లి రాజశేఖర్, డాక్టర్ మోహనరావు, లయన్స్‌క్లబ్ రౌతు శ్రీనివాసరావు, కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, సమాజ విశ్లేషకులు డాక్టర్ మంత్రి వెంకటస్వామి, ఆర్గనైజర్ మాడుగుల సత్యవాణి, నారాయణ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ జగన్నాథం, జిల్ ఫౌండేషన్ జాడ సాయి, హెల్పింగ్ హ్యాండ్స్ శ్రీధర్, ఆ నలుగురు సుప్రజ, ఇండియన్ ఆర్మీ కాలింగ్ బి.వి.రమణ, వినోద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బోయ వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలో పెద్దమడి కాలనీలో ఆదివాసీ సంఘం నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుడు రాంజీ గోండ్ వర్ధంతి సభ ఆదివరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రకులాలైన బోయ, వాల్మీకులను ఆదివాసీ తెగల్లోకి కలుపుతూ సిఎం జగన్ అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరిస్తే నిజమైన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ఓట్లతో గెలిచి గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ లీగల్ సెల్, న్యాయవాది ఊకె రవి మాట్లాడుతూ జిల్లాలో గిరిజన ఓట్లతో గెలిచిన మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, కింజరాపు అచ్చెన్నాయుడు, ధర్మాన కృష్ణదాస్‌లు అసెంబ్లీలో బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానంలో వ్యతిరేకించకుండా సంతకం చేసి గిరిజనులకు అన్యాయం చేశారని అన్నారు. ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పూనెం పాపారావు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై నా ఆదివాసీ జెండా ఎగరవేయాలన్నారు. లేకుంటే మనమంతా కనుమరుగయ్యే అవకాశం ఉందని అన్నారు. ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు, ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సవర చొక్కారావు మాట్లాడుతూ ఆదివాసీలంతా కుల రాజకీయ పార్టీలు వీడి ఆదివాసీ జెండా పట్టి మన ఓటు మన కోసం అని నినాదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి లక్ష్మీపురం కిరణ్, కెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, సవర కుమార్, నేపాల్, రామారావు, కోదండరావు, రాజారావు, ఐ.నారాయణ, ముఖలింగం, సంజీవరావు, జగన్, గణేష్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాతలు ప్రాణదాతలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని డోకులపాడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంపై ప్రచారంలో ఉన్న అపోహలను వీడాలన్నారు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడంతో ప్రాణాలు నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన 25 మంది యువకులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు క్రాంతి, ప్రాణదాత బ్లడ్ బ్యాంకు మేనేజర్ సాయి, సర్పంచ్ ప్రతినిధి వడ్డి కరుణాకర్, ఎంపిటిసి ప్రతినిధి కె.ఢిల్లేశ్వరరావు, రెయ్యి గణపతి, మోహనరావు, ఢిల్లీ, రిషి, చిరంజీవి, రంజిత్, రమేష్, లోకేష్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగన్

ప్రజాశక్తి- నందిగాం

సంక్షేమ సారథి సిఎం జగన్మోహన్‌రెడ్డి అని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని దీనబంధుపురంలో వైస్ ఎంపిపి ఆర్.లక్ష్మీకాంతం, దిమ్మిడిజోల సర్పంచ్ మడపాల సంజీవరావు ఆధ్వర్యాన ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా బటన్ నొక్కి మహిళల ఖాతాలకు జమ చేస్తున్నామని అన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని, వీటి వివరాలను గృహ సారథులు, వాలంటీర్లు లబ్ధిదారులకు తెలియజేసి అవగాహన కల్పించాలన్నారు. ముందుగా ఆయా గ్రామాల్లో భారీ ఎత్తున ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, ఎంపిటిసి బర్న్నాన బాలకృష్ణ, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య, కవిటి ఎర్రన్న, బోరుభద్ర సోమేశ్వరరావు, తమరి దేవేందరరావు పాల్గొన్నారు.


నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి, జీయ్యన్నపేట, హరిశ్చంద్రపురం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, గొద్దు చిరంజీవి, ఎస్.వినోద్, ఎంపిటిసి హనుమంతు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కోటబొమ్మాళి పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు వాలంటీర్లతో, గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు.

ఇచ్ఛాపురం : బెల్లుపడ సచివాలయం పరిధి 13వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, ప్రతినిధి పి.సంతోష్, అనపాన పీతాంబర, గృహసారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.


కవిటి : స్టిక్కర్లను అంటిస్తున్న నాయకులు

మెళియాపుట్టి : మండలంలోని జోడూరు, మారేడుకోట పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసిబాబు, పి.అప్పారావు, పి.శ్రీనివాసరావు, శ్యామల బాబు, పాడి వెంకట్ పాల్గొన్నారు. అనంతరం చిడిపాలెంకు చెందిన సవర కేశమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కవిటి: మండలంలోని జగతి, గొండ్యాలపుట్టుగ, కపాసుకుద్ది గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా వైస్ ఎంపిపి పూడి నేతాజీ, సర్పంచ్‌లు పూడి లక్ష్మణరావు, పూడి ప్రసాదరావు ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసిలు పూడి నీలాచలం, టి.పార్వతి, వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడు పులకల శ్రీరాములు, నాయకులు దుద్ది ధర్మారావు, పిన్నింటి జయరాం, డిక్కల బాబూరావు, ఎ.కూర్మారావు, బి.చలపతి, డి.జయశ్రీ పాల్గొన్నారు.


బూర్జ : పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

రాష్ట్రం అప్పులపాలు

ప్రజాశక్తి- బూర్జ

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాల్చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని పి.ఎల్.దేవిపేటలో ఆదివారం రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ వైఫల్యాలతో ముద్రించిన పోస్టర్లను ఇంటింటికీ అంటించారు. ఈ సందర్భంగా ఒక్కఛాన్స్ అంటూ అధికారంలో వచ్చి ప్రజలను ముంచేశారని అన్నారు. రాష్ట్రంలో ఎత్తి వైపు చూసినా అప్పులు కుప్పలుగా కనిపిస్తుందన్నారు. మరోసారి వస్తే అధికార ఇస్తే రాష్ట్రాన్ని అమ్మే పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి ద్రోణగిరిరావు, టిడిపి మండల పార్టీ నాయకులు వావిలపల్లి సీతారాంబాబు నాయుడు, లంక జగన్నాథంనాయుడు, శ్రీరాములునాయుడు, కడగల కృష్ణ, తుడ్డలి సర్పంచ్ అంపిలి గణపతిరావు, అప్పలపేట సర్పంచ్ కె.రాజు, రాంబాబు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని సంతలక్ష్మీపురం, టకోయి, గాతలవలస, మర్రిపాడు-కె గ్రామాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్‌బాబు రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ముందుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, సంతలక్ష్మీపురం సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, ఉర్లన వసంత్, హెచ్.చంద్రశేఖర్, విష్ణు పండ, పరమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పలాస: మండలంలోని గురుదాసుపురానికి చెందిన టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్ ఇటీవల రామకృష్ణాపురం జాతీయ రహదారిపై జరిగిన దాడిలో గాయపడి చికిత్స పొందాడు. ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇంటికి వెళ్లి లక్ష్మణ్ కుమార్‌ను ఆదివారం పరామర్శించారు. భయపడాల్సిన అవసరం లేదని, టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈయన వెంట టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, దాస్‌నాయుడు ఉన్నారు.

శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటు

లక్ష్మీపురం ఎంపిటిసి మాజీ సభ్యుడు దువ్వాడ శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని ఎంపీ

ఎంపీ పరామర్శ

కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం శ్రీనివాసరావు సంతాప సభ నిర్వహించారు. ముందుగా శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పలాస మాజీ వైస్ ఎంపిపి, ఎంపిటిసిగా పదవులు చేపట్టారని గుర్తుచేశారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేశారని అన్నారు. అటువంటి వ్యక్తి మన మధ్యలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు తల్లిదండ్రులు, మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, మాజీ ఎంపిపి దువ్వాడ కృష్ణమూర్తి నాయుడు, దువ్వాడ శ్రీహర్ష టిడిపి మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

'వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస


కూర్మారావు

18 ఏళ్లలోపు అనాథ పిల్లల చదువులకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం ద్వారా అర్హులకు నెలకు రూ.4 వేలు ఆర్థికసాయాన్ని అందిస్తుందని మండల విద్యా సంక్షేమ అధికారి, ఎపిఎం పైడి కూర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో గాని, పట్టణల్లో గాని తల్లిదండ్రులు లేని వారు, ఇతర కుటుంబ సభ్యుల వద్ద ఆశ్రయం పొందుతున్న పిల్లలను గుర్తించి ఈ నెల 15లోగా మహిళా శిశు సంక్షేమశాఖ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, స్వయంశక్తి గ్రామ ఐక్య సంఘం సభ్యులు, విఒఎలు, ఐసిడిఎస్ ఆశావర్కర్లు తమ పరిధిలో, తమ దృష్టికి వచ్చిన అర్హత గల పిల్లలను గుర్తించి వారితో దరఖాస్తు చేసుకోవడానికి సహకరించాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, కోవిడ్, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన, ప్రాణాంతక వ్యాధులతో తల్లిదండ్రులు బాధపడుతూ ఆర్థికంగా వెనుకబడిన పిల్లలను గుర్తించాలన్నారు. దరఖాస్తుతో పాటు జనన ధ్రువీకరణ, ఆధార్ కార్డుల వివరాలు, తల్లి, తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, విడాకులు, విడిగా జీవిస్తున్నట్లు విఆర్ఒ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, స్కూల్ స్టడీ ధ్రువపత్రం, బ్యాంకు ఖాతా, ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాల నకళ్లను మహిళా శిశుసంక్షేమ అధికారికి సమర్పించాలని అన్నారు.

జనసేన నాయకుల నిర్బంధం


జనసేన నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో జనసేన పార్టీ నాయకులు ఆదివారం ఆందోళనకు పిలుపునివ్వడంతో పట్టణ పోలీసులు ముందుస్తుగానే నిర్బంధించారు. దీంతో ఒక్కసారిగా జనసేన కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. రైల్వే గేట్ వద్ద నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మూడు నెలలుగా రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అండర్ పాస్ వే నిర్మించాలని విన్నవించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో జనసేన పార్టీ నాయకులు ఆందోళనకు సిద్ధమయ్యారు. పట్టణ, రూరల్ ఎస్ఐలు ఐ.గోవిందరావు, ఎస్.రామకృష్ణలు ఆందోళన చేయడానికి అనుమతి లేదంటూ ఉదయం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, ఆర్.భాస్కర్, కలియాను నిర్బంధించి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు ఒక్కసారిగా ఆందోళన బాటపట్టారు. ప్రజా సమస్యపై పోరాడుతున్న తమ నేతలను అన్యాయంగా నిర్బంధించి పోలీస్ స్టేషన్‌లో ఉంచడం దారుణమని ప్రశ్నించారు. అనంతరం వ్యక్తి గత పూచికత్తుగాపై జనసేన నాయకులను విడిచిపెట్టారు. అనంతరం రైల్వే స్టేషన్ మాస్టార్ సాహును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళనకు సిద్ధంగా ఉంటే పోలీసులు అన్యాయం నిర్బంధించారని అన్నారు. ప్రతి పది నిమిషాలకు ఒకసారి రైళ్లు వస్తుండడంతో తరచూ గేట్ వేస్తున్నారని అన్నార. దీంతో రోగులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని అన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వేసవి తీవ్రత పెరగడంతో నగరానికి వచ్చి, వెళ్లే ప్రయాణికులకు ఆర్‌టిసి యాజమాన్యం శ్రీసత్యసాయి సంస్థల సహకారంతో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ మేరకు కాంప్లెక్స్ ఆవరణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వందలాది ప్రయాణికులకు ఊరట లభించింది. కార్యక్రమంలో డిపో మేనేజర్ మాధవ్, అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, బస్‌స్టేషన్ మేనేజర్ వి.శామ్యూల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఎస్.నాయుడు, సత్యసాయి యువజన విభాగం సభ్యులు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ రేగిడి లక్ష్మి ప్రారంభించారు. వేసవి ఎండలు తీవ్రత ఎక్కువ కావడంతో చలివేంద్రాన్ని ప్రారంభించామని సత్యసాయి సేవాసమితి కన్వీనర్ డి.రాధాకృష్ణ తెలిపారు.

'జెసిఐ' నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో జెసిఐ స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సామాజిక, వ్యక్తిగత కార్యక్రమాలు చేపడుతుందని నూతన అధ్యక్షుడు మాటురి స్వరూప్ కుమార్ అన్నారు. స్థానిక రోటరీ భవనంలో జెసిఐ వార్షికోత్సవ వేడుకలను మాజీ అధ్యక్షులు జి.దిల్లేసు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా మాటురి స్వరూపకుమార్, కార్యదర్శిగా టి.షణ్ముఖరావు, కోశాధికారి శ్రావణ కుమార్, జోన్ అధ్యక్షులుగా జి.ఎస్.ఎన్.వర్మలను ఎన్నుకున్నారు. జాతీయ మాజీ ఉపాధ్యక్షులు రజిత పుసర్ల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జ్ఞాన భారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్, కో-ఆర్డినేటర్ నవీన్‌కుమార్, సభ్యులు రోషిత్ కుమార్, షణ్ముఖరావు, సురేష్, చిన్ని, పవన్‌కుమార్, ప్రేమ్ సాయి పాల్గొన్నారు.


ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

రైల్వే పార్కింగ్ వాహనాలకు రక్షణ కల్పించాలి

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న సాయి తరుణ్ పార్కింగ్ సెంటర్‌లోని వాహనాలకు సరైన రక్షణ కల్పించి వాహనదారులకు న్యాయం చేయాలని ఎపి పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ బొడ్డేపల్లి మోహనరావు, కో-కన్వీనర్ బెండి నారాయణరావులు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైల్వే స్టేషన్ పార్కింగ్ స్థలంలో ఎండకు ఎండుతున్న ద్విచక్ర వాహనాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కింగ్ రుసుం చెల్లిస్తున్న వాహనదారుల రక్షణ కల్పించుకుంటే ఎలా అని ప్రశ్నించారు. పార్కింగ్ చేసిన వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి పాడైపోతున్నాయని అన్నారు. దీనివల్ల వాహనదారులు ఆర్థికంగా నష్టపోతారని అన్నారు. ఎండలో వాహనాలు నిలిపి ఉండడం వల్ల పెట్రోల్ ఆవిరై వాహన రంగు వెలిసిపోయి పాడైపోతుందన్నారు. దీనివల్ల మన్నిక తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. ఇదే విషయాన్ని పార్కింగ్ కాంట్రాక్టర్ బెన్న ప్రసాద్‌ను కలిసి సమైక్య నేతలు సమస్యను వివరించారు. ఈ విషయమై కాంట్రాక్టర్ సానుకూలంగా స్పందించి రైల్వే ఉన్నతి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.


వాహనాలను చూపిస్తున్న మోహనరావు

భద్రంగా విద్యా కానుకల కిట్లు

టెక్కలి: రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించనున్న జగనన్న విద్యా కానుక కిట్ల నిల్వ కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకులు, అకడమిక్ మోనిటరింగ్ అధికారి బి.విజయభాస్కర్ ఆదివారం పరిశీలించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించాల్సిన విద్యా కానుక కిట్లు అన్నింటినీ ఒకచోట భద్ర పరచి అక్కడ నుంచి నేరుగా పాఠశాలలకు తరలించనున్నా మని తెలిపారు. ఈయనతో పాటు ఎంఇఒ డి.నాగభూషణం, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఉమ, ఎంఆర్‌సి సిబ్బంది సంతోష్, రవి ఉన్నారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయ భాస్కర్


అవగాహన కల్పిస్తున్న బలరాంరెడ్డి

ఆర్థిక పురోగతిపై అవగాహన

ప్రజాశక్తి- పలాస

అడ్డదారిలో డబ్బులు సంపాదించాలని కోరిక, రాత్రికి రాత్రి కోటీశ్వరులు అవ్వాలని తప్పుడు ఆలోచనతో అనేక మంది మోసపోతూ, మోసాలు చేస్తూ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) జిల్లా రిసోర్స్ పర్సన్ డాక్టర్ బోర బలరాంరెడ్డి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో విద్యా వాహిని కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌లో ఆదివారం గ్రీన్ ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఫైనాన్షియల్ వర్క్‌షాప్ నిర్వహించారు. వ్యాపారవేత్తలకు ఆర్థికపరమైన శిక్షణ, ఆర్థిక పురోగతి, ఆర్థిక విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీల విషయంలో ముందు జాగ్రత్తగా ఉండాలన్నారు. పెట్టిన మదుపుకు ఇంట్రెస్ట్ కంటే కార్పస్ ఇంట్రెస్ట్ వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. అప్పుడే అధిక లాభాలు వస్తుంటాయని పేర్కొన్నారు. నమ్మశక్యమైన, సురక్షితమైన షేర్లను దీర్ఘకాలిక సమయానికి కొనుగోలు చేసి వేచి ఉండాలన్నారు. క్రెడిట్ కార్డులు వాడకాలికి దూరంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు ఎన్ని జరుగుతున్నా ఇంకా ఎక్కడో మోస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు అడిగిన ఫైనాన్షియల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాలరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట మోహన్, విద్యా వాహిని కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, ప్రభుత్వ ఉపాధ్యాయులు బత్తిని ఓంకార్ మాస్టర్, కిషోర్ కుమార్ పాత్రో, అంబలి కృష్ణారావు, ట్రెజరీ అధికారి మన్మథరావు, ఇరిగేషన్ అధికారి శ్రీనివాసరావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఉపేంద్ర రెడ్డి, బ్యాంకు అధికారి చిన్నాచారి, యుటిఎఫ్ అధ్యక్షులు టి.అప్పారావు, రుషికేశ్వరరావు, గ్రీన్ కార్యదర్శి బందాపు తిరుమల పాల్గొన్నారు.


మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మానవత్వాన్ని చాటుకున్న పోలీసులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని దుప్పిలపాడు పంచాయతీ పరిధిలో ఉన్న పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. అయితే మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడు, ఎప్పుడు మృతి చెందాడు అన్న విషయం తెలియరాలేదు. ఆదివారం ఉదయం దుప్పిపాడు, కొప్పలపేట గ్రామాలకు చెందిన కొంతమంది పొలం పనులకు అని అటుగా వెళ్లేసరికి మృతదేహం దుర్వాసన వెదజల్లుతూ పురుగులు పట్టి కనిపించింది. దీంతో వారు సమాచారాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు చెందిన హెచ్‌సి విశ్వేశ్వరరావు, హెచ్‌జి లింగమూర్తిలు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని వారే పాడికట్టి మోసుకుంటు రోడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని సమాచారం తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

నేడు వికలాంగుల ధర్నా

టెక్కలి : వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు పెంచుతామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి వికలాంగులు హాజరుకావాలని కోరారు.


మాట్లాడుతున్న కృష్ణ

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రజా సేవలు మరింత విస్తృతం చేయాలని శిష్టకరణాల సంఘం అధ్యక్షులు సదాశివుణి కృష్ణ కోరారు. నరసన్నపేటలోని సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మరిన్ని సేవలు నిర్వహించి సమాజంలో ఆదర్శమైన సంఘంగా పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సదాశివుణి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అంపలాం వసంతకుమార్, కోశాధికారిగా ఎం.వి.జె.మోహనరావు, ఉపాధ్యక్షులుగా రాజమహంతి గోవిందరాజులు, రఘుపాత్రుని బుజ్జి (శ్రీధర్), సహాయ కార్యదర్శులుగా రాజమహంతి శ్రీనివాసరావు, చౌదరి సూర్యప్రకాశరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మహిళా కన్వీనర్లుగా రాజమహంతి శోభారాణి, నందిగాం లక్ష్మి, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉర్లాం పార్వతీశ్వరరావు, ఎస్.ప్రభాకరరావు, సంఘ సలహాదారులుగా సదాశివుణి ప్రభాకరావు, డబ్బీరు వెంకట రఘు, సదాశివుణి రాంబాబు, బూరవెల్లి భాస్కరరావు, ఎ.పి.వి.రమణమూర్తి, ఉరిటి రాధాకృష్ణ, రాజమహంతి కాళిదాస్, సదాశివుణి ఝాన్సీ, బెహరా రామ్మోహనరావు తదితరులను ఎన్నుకున్నారు.


పరామర్శిస్తున్న మంజు

మంజు పరామర్శ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కోటబొమ్మాళి మండలంలోని దుప్పలపాడు పంచాయతీ కొప్పలపేటకు చెందిన టెక్కలి ఎంపిటిసి-2 కూన పార్వతి అత్త కూన మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు మృతురాలి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. సంద ర్భంగా మల్లమ్మ మృతి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా మల్లమ్మ చిత్రపటా నికి పూలమాలనేసి నివాళ్లర్పించారు. ఈమెతో పాటు గణపతి, విశ్రాంత పాధ్యాయులు గురువెల్లి వెంకట రమణ, కణితి మల్లయ్య ఉన్నారు.

పొందూరులో అన్నదానం

పొందూరు : స్థానిక రామభజన వీధిలో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ మేరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పొందూరు, తండ్యాం, బొట్లపేట, ఎస్ఆర్ఎన్ కాలనీ, ఎరుకుల కాలనీ తదితర గ్రామాల నుంచి వేలాది మంది యాత్రికులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని సన్ రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన సామాజిక బాధ్యతగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రోగులకు ఉచిత వైద్య సేవలు అందిస్తుంది. అందులో భాగంగా శ్రీకాకుళం మండలం సిలగాం సింగువలసలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వైద్యాధికారి రాజు 200 మందికి రోగులకు బిపి, సుగర్, మచూచీ, జ్వరాలపై వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజు